# ‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో గోపాల్

పరిగి, జనవరి 8 : పదోతరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని పరిగి మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ, గురుకుల పాఠ శాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నెం.1లో జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎంఈవో గోపాల్ మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తప్పనిసరిగా నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రతి విద్యార్థికి ఏపీపీఏఆర్ ఐడీ జనరేషన్ కోసం శిక్షణ ఇవ్వడంతోపాటు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కమిటీలు, చైల్డ్ సేఫ్టీ కమిటీలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ గెజిటెడ్ హెడ్మాస్టర్లు నాలుగు నుంచి ఐదు పాఠశాలలను సందర్శించాలని ఆయన సూచించారు.

## విద్యార్థులకు గ్లాసుల పంపిణీ



పరిగి, జనవరి 8 : పరిగి మండలంలోని రంగంపల్లి యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు రాగిజావ తాగేందుకు బుధవారం ఉపాధ్యాయురాలు ప్రతిభ స్టీల్ గ్లాసులు అందజేశారు. ప్రతి విద్యార్థినులకు ఆమె గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేత



కులకచర్ల, జనవరి 8 : విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకే అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కామునిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమలత అన్నారు. బుధవారం కులకచర్ల మండల పరిధిలోని కామునిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ కిష్టమ్మ, అంగన్‌వాడీ టీచర్ పండరీబాయి, ఉపాధ్యాయులు రజిత, లలిత, ఆయా కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుప్పట్లు, బెడ్‌షీట్లు పంపిణీ



మర్పల్లి, జనవరి 8 : మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంతో పాటు పట్లూర్ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీవో రాజమల్లయ్య బుధవారం సందర్శించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాను సారం వసతి గృహాల్లో చేపట్టిన మరమ్మత్తులను, గదిలో ఉన్న బియ్యం, సరుకులను పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం బాలికల వసతి గృహంలోని విద్యార్థులకు దుప్పట్లు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ తుల్జారామ్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ అభివృద్ధికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు

కులకచర్ల, జనవరి 8 : కులకచర్ల మార్కెట్ కమిటీ అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ పాలక వర్గం మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులు, డైరెక్టర్లతో కలిసి తీర్మానం చేశారు. రైతులు మార్కెట్‌కు వస్తే వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. దీనికి గాను మార్కెట్ కమిటీ స్థలంలో రూ. 93లక్షలతో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించాలని తీర్మానం చేశారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో మార్కెట్ యార్డులో 20 షాపింగ్ మాల్స్, మార్కెట్ కమిటీ భవనం, వాష్‌రూములు, వివిధ అభివృద్ధి పనులు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్‌శర్మ, డీఎంవో సారంగపాణి, మార్కెట్ కార్యదర్శి విజయకిషోర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



నవాబుపేట, జనవరి 8:కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నవాబుపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతి కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రతిపక్ష నాయ కులను కేసులతో లొంగదీసుకోవడం వంటి చిల్లర పనులతో కాలయాపన చేస్తుందని ఆవేదన వ్యక్తం జేశారు. బీఆర్ఎస్ నాయకులకు సంబంధం లేని విషయాల్లో కేసులు పెట్టాలని చూడటం సిగ్గుచేటని విమర్శంచారు. ఇప్పటి వరకు రైతులకు రైతుభరోసా ఇవ్వకుండా ఇస్తానన్న రూ. 15వేలకు బదులు 12వేలు ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు.

# తెల్లబంగారం నేలపాలు

■ అకాల వర్షాలకు దెబ్బతిన్న పత్తిపంట ■ తగ్గిన దిగుబడి ■ కూలీల కొరతతో మరింత సమస్య

ధారూరు, జనవరి 8: రైతులు సాగు చేసిన తెల్ల బంగారం పంటకు కూలీల కొరత ఏర్పడింది. మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో రైతులు తెల్ల బంగారం(పత్తి) పంట సాగు చేసుకున్నారు. మండల పరిధిలోని ఏడు క్లస్టర్లు ధారూరు, కేరెళ్లి, మోమిన్‌కలాన్, మున్నూర్‌సోమారం, నాగారం, గురుదోట్ల, నాగసముందర్ గ్రామాల్లో మొత్తం 12వేలు ఎకరాల్లో సాగు చేశారు. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు పత్తి పంటలు భారీగా దెబ్బతిని దిగుబడి తగ్గిపోయిందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కూలీల కొరత ఏర్పడడం, పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం ముగిసినప్పటికీ ఎప్పుడు వర్షం కురుస్తుందోనని తెలియకుండా ఉన్నదన్నారు. బయటపడ్డ పత్తిని తొలుచుకొని ఇండ్లకు తరలించుకుందా మంటే కూలీలు లభించక, ఒక వేళ వచ్చినా రూ.400 నుంచి 500 వరకు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పొలంలోనే పత్తి రాలిపోవడాన్ని చూసి కన్నీరు పెట్టుకునే పరిస్థితి దాపు రించింది. కూలీ సామాన్యంగా రూ.300 నుంచి రూ.350 ఉండగా, ప్రస్తుతం అదును చూసుకొని రూ.400 నుంచి రూ.500ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు రైతులు తెలిపారు. డిమాండ్ ప్రకారం కూలీ చెల్లించడంతో పాటు వారి ప్రాంతం నుంచి ఇక్కడకి వచ్చేందుకు రవాణా సౌకర్యాలకు ఆదనంగా చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. గత సంవత్సరం సీజన్ లో పత్తి తీసేందుకు కిలోకి రూ.10 నుంచి 12 లు ఉండగా, ప్రస్తుతం



కిలోకు రూ.12 నుంచి రూ.15 వరకు చెల్లిస్తున్నట్లు తెలిపారు. వాణిజ్య పంటలపై రైతులు ఆసక్తిని పెంచుకోవ డంతో ఈ ప్రాంతంలో చాలా వరకు పత్తి పంట సాగు పెరిగి పోయింది. పత్తి పంట సాగుకు ఎకరాకు రూ.5వేలు నుంచి రూ. 6 వేలు వరకు పెట్టుబడిని పెట్టినట్లు తెలిపారు. గత ఏడాది ఎకరాకు 10క్వింటాళ్ల నుంచి 12క్వింటాళ్ల వరకు దిగు బడి రాగా, ఈ ఏడాది ఎకరాకు 7క్వింటాళ్ల నుంచి 8 క్విం టాళ్ల కు దిగుబడి పడిపోయిందని, పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అం దే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కూలీల కొరత ఉంది...



పెట్టుబడి పెట్టి సాగు చేసుకున్న పంటలు చేతికందే సరికి కూలీల కొరత ఏర్పడింది. పండించిన పంటకు దిగుబడి వస్తుందో లేదో కానీ కూలీలకు మాత్రం అధికంగా డబ్బులు చెల్లించవల్సివస్తుంది. రోజు కూలీ అయితే రూ. 300 నుంచి 400 వరకు ఉందని, కిలో లెక్క అయితే రూ. 12 నుంచి 15 వరకు చెల్లించాల్సి వస్తుంది. గత సంవత్సరం అయితే కిలో రూ.10 నుంచి 12 వరకు ఇచ్చేది. ఈ సంవత్సరం అధికంగా కూలీ డబ్బులు ఇవ్వాల్సి వస్తుంది. గత సంవత్సరం ఎకరాకు 10 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్లు ఉం డేది, ఈ సంవత్సరం ఎకరాకు 8క్వింటాళ్ల నుంచి 10క్విం టాళ్లు మాత్రమే వస్తుంది. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం దిగుబడి తక్కువగా వస్తుంది.

– రాజు, రైతు, కెరెళ్లి, ధారూరు మండలం

## సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తా..



దోమ, జనవరి 8 : దోమ మండలం మోత్కూర్ వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా ఎన్నికైన యాదవరెడ్డి బుధవారం పీఏసీఎస్ కార్యాలయానికి వచ్చిన సహకార సంఘంలో రైతుల రుణమాఫీ, ధీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు తదితర వివరాలను సీఈవో యాదగిరిని అడిగి తెలుసుకున్నారు. సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. రుణమాఫీ కాని రైతులకు తప్పకుండా మాఫీ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, దోర్నాలపల్లి మాజీ సర్పంచ్ యాదయ్య, పరిగి మండల ఎస్టీ సెల్ నాయకుడు తావుర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 30 కిలోల గంజాయి స్వాధీనం



తాండూరు రూరల్, జనవరి 8 : తాండూరు రైల్వేపరిసరాల ప్రాంతంలో ఓ వ్యక్తి గంజాయి సరఫరా, అమ్మకాలు జరుపుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి, 30 కిలోల గంజాయి, వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. జిల్లా టాస్క్‌ఫోర్సు సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిషా రాష్ట్రంలోని గంజాం జిల్లాకు చెందిన శిభారం స్వైన్ అనే వ్యక్తిని తాండూరు పట్టణంలోని రైల్వే సమీపంలో తనిఖీ చేయగా, అతని వద్ద 12 కేజీల ఎండుగంజాయి లభించిందని తెలిపారు. మరో గుర్తుతెలియని వ్యక్తి వద్ద తనిఖీ చేయగా, 16 కేజీల ఎండు గంజాయితోపాటు 2 కేజీల గంజాయి పొడర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.మొత్తం 30 కేజీలు స్వాధీనం చేసుకొని, ఒకరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.ఈ దాడుల్లో ఎస్సై ప్రేమ్ కుమార్‌రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, హనుమంతు, రవికిరణ్‌శివ, మహేందర్‌కుమార్ ఉన్నారు.



పెద్దేముల్, జనవరి 8: ఇందిరమ్మ ఇండ్ల సూపర్ చెక్‌ప్‌లో భాగంగా మండల పరిధిలోని కందనెల్లి తండాలో బుధవారం పెద్దేముల్ ఎంపీడీవో జర్నప్ప తనిఖీ చేశారు. గ్రామాల్లో ఇన్ని రోజులు పంచాయతీ కార్యదర్శులు చేసిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే రిపోర్ట్ ఆధారంగా ఒక్కొక్క గ్రామం నుంచి ఐదు శాతం డాటాను తనిఖీ చేసే బాధ్యత జిల్లా అధికారులు, ఎంపీడీవోకు పంపి మళ్లీ తనిఖీ చేయమని చెప్పడంతో ఈ సూపర్ చెకప్ నిర్వహిస్తున్నట్లు పెద్దేముల్ ఎంపీడీవో జర్నప్ప తెలిపాడు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



కులకచర్ల, జనవరి 8 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బిలకంటి సాయిరెడ్డి భార్య పద్మమ్మ అనారోగ్యంతో ఇటీవలి మృతి చెందింది. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి బుధవారం దశదిన కర్మకు హాజరై మృతురాలి భర్తను, వారి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ చౌడా పూర్ మండలఅధ్యక్షుడు సత్తినేని సుధాకర్‌రెడ్డి, కులకచర్ల మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు పీరంపల్లి రాజు, బీఆర్ఎస్ నాయకులు మాలె కృష్ణయ్యగౌడ్, బాల్‌రెడ్డి, బిలకంటి శ్రీనివాస్‌రెడ్డి, పాశం నవీన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాకొండ దామోదర్‌రెడ్డి, ఎస్ బాల్‌రెడ్డి, ఘనాపురం రాములు, గుండుమల్ల నర్సింహులు, కాంగారి ఆంజనేయులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



వికారాబాద్, జనవరి 8 : ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేద కుటుంబాలకు వరం లాంటిదని మోమిన్‌పేట మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మోమిన్ పేట మండల కేంద్రం లోగల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో లబ్ధి దారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు శంకర్ యాదవ్ తో కలిసి 11 మంది లబ్ధిదారులకు రూ, 4.74లక్షలు లబ్ధిదారులకు సీఎంఆర్ చెక్కులు అందజేశారు. కార్యక్ర మంలో మండల అధ్యక్షుడు సుభాష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ బందయ్య, సుభాష్‌గౌడ్, రాజ్ పాషా, మహేందర్ చారి, సత్యనారాయణ గౌడ్, ఎజాజ్, రవి, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, జనార్దన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల సందర్శన..



పెద్దేముల్, జనవరి 8 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఎమ్మార్వో వెంకటేశ్ ప్రసాద్, ఎంపీడీవో జర్నప్ప సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న బోధన గురించి విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా 10వ తరగతి విద్యార్థులు ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు పోటీగా చదువాలన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని వారు సూచించారు. అదే విధంగా హాస్టల్‌ను సందర్శించి అక్కడ నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

# ఆశ చూపారు.. రూ.12లక్షలు లాగారు..

### జాబ్, బిజినెస్ పేరుతో సైబర్‌చీటర్స్ మోసం

సిటీబ్యూరో, జనవరి 8(నమస్తే తెలంగాణ): ఓ మహిళ సెల్‌ఫోన్‌కు పార్ట్ టైమ్ ఉద్యోగమంటూ వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌కు స్పందించిన బాధితురాలు సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కి రూ.12లక్షలు పోగొట్టుకున్నది. 3ఐ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి మెసేజ్ చేస్తున్నామని, వర్క్ ఫ్రమ్ హోమ్‌కు అవకాశముందని అందులో పేర్కొన్నారు. దీంతో బాధితురాలు అందులో ఉన్న సెల్ నంబర్‌కు కాల్ చేసింది. అనంతరం గూగుల్ మ్యాప్స్‌ను ఓపెన్ చేసి ‘ది పీచ్ డోర్’ అనే పేరుతో రెస్టారెంట్‌ను క్లిక్ చేయాలని, అందులో రివ్యూ రాసి, 5 స్టార్స్ ఇచ్చి పోస్టు చేయాలంటూ సైబర్ చీటర్స్ ఓ లింక్‌ను పంపించారు. ఆ తరువాత స్క్రీన్ షాట్ పంపిస్తే రూ.200 ఇస్తామంటూ ఆ డబ్బులు ఫోన్ పే ద్వారా పంపించారు. ఆ తరువాత రూ.3వేలు చెల్లించండి.. మీకు అదనంగా డబ్బులు వస్తాయంటూ నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితురాలు రూ.3వేలు పంపించడంతో రూ.3880 తిరిగి ఆమె ఖాతాలోకి వచ్చాయి. దీంతో బాధితురాలికి వారిపై నమ్మకం కుదిరింది. ఆ తరువాత రూ.7వేలు డిపాజిట్ చేయించుకొని, రూ.8400 పంపిస్తామంటూ నమ్మించారు. అయితే టెక్నికల్ సమస్యలతో ఆ డబ్బు తిరిగి పంపించలేకపోతున్నామని నమ్మించారు.

### ఆశ చూపారు.. బిజినెస్‌లోకి లాగారు..

ఆ తర్వాత ఆమె మైండ్‌ను డైవర్ట్ చేసి ట్రేడింగ్ బిజినెస్‌లోకి లాగి బాధితురాలి నంబర్‌ను ‘డాటా క్లిక్ 700–బి’ అనే టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేశారు. అనంతరం ‘యూ కాయిన్ సంస్థ’కు చెందిన కాయిన్‌బిట్స్.మై అనే యాప్ లింక్ ను పంపించి అందులో షేర్స్ పెట్టుబడి పెడితే భారీ లాభాలొస్తాయంటూ నమ్మించి రూ.11.92 లక్షలు పెట్టుబడి పెట్టించి ఆమెను మోసం చేశారు. బాధితురాలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వేలానికి 1087 వాహనాలు

### అభ్యంతరాలుంటే దరఖాస్తు చేయండి : సీపీ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, జనవరి 8(నమస్తే తెలంగాణ): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కారణాలతో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాల్లో క్లైయిమ్ చేయని 1087 వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ వాహనాల వేలానికి ఎవరికైనా అభ్యంతరం ఉంటే వారి యాజమాన్య, హైపోతికేషన్ సంబంధించిన పత్రాలతో బంజారాహిల్స్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో ఈ ప్రకటన వెలువడిన ఆరు నెలల లోపు దరఖాస్తు చేయాలని సూచించారు. వాహనాలు అంబర్‌పేట్‌లోని సీపీఎల్ పోలీస్ గ్రౌండ్‌లో ఉన్నాయని, వివరాలకు హైదరాబాద్ పోలీస్.జీవోవీ.ఇన్ అధికారిక వెబ్‌సైట్‌లోనూ పరిశీలించుకోవచ్చని సీపీ సూచించారు.

## చెరుకు పంట బూడిద

పెద్దేముల్, జనవరి 8 : పెద్దేముల్ మండలం బండమీదిపల్లిలో సాయప్ప అనే రైతు పొలం పై నుంచి విద్యుత్ తీగలు ఉన్నాయి. బుధవారం తీగలు ఒకదా నికొకటి రాసుకుని చెరుకుతోటలో నిప్పు పడ టంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట బూడిదైందని రైతు తెలిపాడు. సుమారుగా లక్ష రూపాయలు ఆస్తి నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశాడు.

### నేడు విద్యుత్ సరఫరాలో
## అంతరాయం

తాండూరు రూరల్, జనవరి 8 : కొడంగల్ నుంచి కొత్లాపూర్ వరకు నేషన్ హైవే రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున కరెంట్ స్తంభాలను తొలగించడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తాండూరు ట్రాన్స్‌కో డీఈ భాను ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. గౌతాపూర్, జినుగుర్తి, కోటబాసుపల్లి, కరణ్‌కోట సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

### స్కూటీని ఢీ కొన్న లారీ..
## మహిళ దుర్మరణం

వికారాబాద్, జనవరి 8: లారీ ఢీ కొని మహిళ మృతి చెందిన ఘటన వికా రాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. వికారాబాద్ సీఐ భీమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..కోట్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన శివమ్మ, కొడుకు రవికుమార్ బుధవారం వికారాబాద్ కోర్టులో పనులు ముగించుకొని మధ్యాహ్నం ఇంటికి స్కూటీపై బయలు దేరారు. వికారాబాద్ నుంచి ఫారెస్ట్ ఆఫీస్ మీదుగా వెళ్తుండగా .. ఫారెస్ట్ ఆఫీస్ టర్నింగ్ దగ్గరగా ఎదురుగా వస్తున్న లారీ డ్రైవరు స్కూటీని ఢీకొట్టాడు. స్కూటీపై గల ఇద్దరూ కిందపడి తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని వెంటనే వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకి తీసుకొని వెళ్లగా శివమ్మ చనిపోయినదని డాక్టర్లు నిర్ధారించినారు. రవి కుమార్‌కు గాయాలు అయ్యాయి. శివమ్మ మృతికి కారణమైన లారీ డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలని మృతురాలి తమ్ముడు శ్రీశైలం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లారీ డ్రైవర్ వివరాలు తెలుసుకోగా అతని పేరు గంధం కుశలన్న నివాసం అప్పరాల గ్రామం కొత్తకోట మండలం వనపర్తి జిల్లా అని తెలిసిందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### ఆర్భాటాలు కాకుండా
## పనులు పూర్తి చేయాలి

పరిగి, జనవరి 8: ప్రభుత్వం పరిగి అభివృద్ధికి శిలాఫలకాలు, ఆర్భాటాలు కాకుండా సకాలంలో పనులు పూర్తి చేస్తే బాగుంటుందని టీజేఏసీ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. తద్వారా నియోజకవర్గానికి సాగునీరు తీసుకురావాలన్నారు. అసంపూర్తిగా ఉన్నటువంటి సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. పరిగి ప్రజలకు అవసరమైన పనులు ముఖ్యంగా విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం, ఇంటిగ్రేటెడ్ గురుకులాల భవనం నిర్మాణాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పరిగి అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు

## బార్‌లో యువతుల నృత్యాలు.. కేసు

అమీర్‌పేట్, జనవరి 8: మద్యం తాగేందుకు వచ్చే వారి నుంచి అధిక మొత్తంలో డబ్బులు దండుకునేందుకు నిబంధనలకు విరుద్ధంగా యువతులతో నృత్యాలు చేయిస్తున్నారన్న సమాచారం మేరకు బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. సనత్‌నగర్ పీఎస్ పరిధిలోని లక్ష్మీకళ థియేటర్ సమీపంలోని ఎవర్‌గ్రీన్ బార్‌లో ఎటువంటి వినోదం అనుమతులు లేకుండా యువతులతో నృత్యాలు చేయిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించి 10 మంది యువతులను, 10 మంది బార్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని సనత్‌నగర్ పీఎస్‌కు తరలించారు. బార్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కోసం వారిని సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.


## TENDER NOTIFICATION

Rc. No: 3121/A3/MDM/2024 Date: 08-01-2025

Sealed Tenders are invited from Registered Firms for Supply of Utensils (Kitchen Equipment's) to (659) Identified School point in Vikarabad District for the Academic year 2024-25.

| Sl. No. | Tender item | No. of Units Required | Cost of Tender Document | Cost of EMD |
|---|---|---|---|---|
| | Bagona for Rice | 729 | | |
| | Bagona for Curry/Samber | 1977 | | |
| | Steel basin for serving | 1733 | | |
| | Steel container for ingredients | 3345 | | |
| 1 | Steel bucket for serving | 1733 | 5,000/- | 2,00,000/- |
| | Steel spoons for serving Rice | 2149 | | |
| | Steel spoons for serving Curry | 2149 | | |
| | Kabgir used for cooking of Rice | 729 | | |

- Sale of Tender Documents : From 16-01-2025 to 23-01-2025
- Last Date for submission of Tender : 23-01-2025 upto 5.00 P.M.
- Opening of sealed Tenders : 28-01-2025 by 12.00 P.M. at Addl. Collector (LB) Chamber
- Cost of Tenders form & Cost of EMD Demand Draft should be drawn in favor of the **"District Educational Officer, Vikarabad".**
- For Tenders form and other information may be obtained from the O/o. District Educational Officer, Vikarabad District (i.e., IDOC Room No. F-03) on working days.
- For Tenders form and other information may be obtained from the O/o. District Educational Officer, Vikarabad on working days.
- The Utensils Size may varies in different size.

**Contact:** 1. Sri Ravi Kanth, Spdnt., O/o. DEO Vikarabad, **Contact: 9849441671.**

2. Sri K.Suman, Jr. Asst., O/o. DEO Vikarabad, **Contact: 7207171856.**

- Full rights are reserved to Addl. Collector, Vikarabad District to cancel, modify and extension of dates without any information.

**Note:** Register firms should be contain GST & TIN Number and IT clearance.

**Sd/- DISTRICT EDUCATIONAL OFFICER, Vikarabad District.**